నరేంద్ర జీవితం సర్వం.. అవినీతి పర్వం

- ఎమ్మెల్యే కిలారి రోశయ్య ధ్వజం
- గ్రావెల్ మాఫియాపై చర్చకు సిద్ధం
- ధూళిపాళ్ల నరేంద్రకు సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య

పట్నంబజారు: నీ జీవితం సర్వం అవినీతి పర్వం.. మైనింగ్ మాఫియా డాన్‌గా పేరున్న నువ్వు.. గ్రావెల్ మాఫియా గురించి మాట్లాడటమా? పొన్నూరు నియోజకవర్గంలో ఏ తలుపు తట్టినా.. నీ అక్రమాల్ని కథలుగా చెబుతారని పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ధ్వజమెత్తారు. 500 ఎకరాల్లో గ్రావెల్ మాఫియా చేశారని వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర నిరూపించాలని సవాల్ విసిరారు. నరేంద్ర ఆయన తమ్ముడు సురేంద్ర మైనింగ్ మాఫియాకు నిలువుటద్దాలని విమర్శించారు. ఎవరి ఆస్తులు ఎంత ఉన్నాయో బహిరంగంగా మాట్లాడే దమ్ముందేమో చెప్పాలని డిమాండ్ చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్లలో 500 ఎకరాల్లో గ్రావెల్ మాఫియా జరిగితే, 25 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న నరేంద్ర ఎంత చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మైనింగ్ మాఫియా డాన్‌గా పేరున్న నరేంద్ర గ్రావెల్ మాఫియా గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేవారు. వి.ఎస్. పాలెం, వడ్లమూడి, శేకూరుతో పాటు తదితర ప్రాంతాల్లో ఎక్కడైనా.. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరిగిందని చూపించగలరా ? అని ప్రశ్నించారు. పూర్తిస్థాయి అనుమతులతో పలు ప్రాంతాల్లోని జగనన్న కాలనీలు, రైల్వేకు సంబంధించి జీఆర్ ఇన్‌ఫ్రా అనే కంపెనీలకు పూర్తిస్థాయిలో లెక్కల ప్రకారం, ఇప్పటి వరకు 9.76 లక్షల టన్నుల గ్రావెల్ వెళ్లిందని చెప్పారు. నరేంద్రలాగా క్వారీ ఆలయం వద్ద 38 ఎకరాల్లో అక్రమంగా తవ్వలేదని, కేవలం దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని తెలిపారు. పూర్తిస్థాయి అధికారుల అనుమతులతో ఇప్పటి వరకు 32 ఎకరాల్లో మాత్రమే గ్రావెల్ తవ్వకాలు జరిగాయని వివరించారు. వ్యాపారాలు చేసి తాను పైకి వచ్చానని.. నరేంద్ర మాదిరిగా పాడి రైతుల్ని మోసం చేసి రాలేదని మండిపడ్డారు. పెద్దఎత్తున మైనింగ్ మాఫియాకు పాల్పడ్డ నరేంద్ర, దళితులకు ఇచ్చిన భూముల్ని సైతం లాక్కుని మైనింగ్ చేశారని ఆరోపించారు. రైల్వే భూముల్లో సైతం మైనింగ్ చేస్తే.. నీపై కేసు పెట్టలేదా? అని రోశయ్య ప్రశ్నించారు. సంగం డైయిరీని అడ్డం పెట్టుకుని చేస్తున్న అవినీతి, బోనస్‌లు ఎగ్గొట్టిన సంగతీ ప్రతి ఒక్కరికి తెలుసన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. న్యాయస్థానాల ద్వారా నరేంద్ర అవినీతిపై పోరాడతామని స్పష్టం చేశారు. ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రావెల్‌కు సంబంధించిన పూర్తిస్థాయి రికార్డులు, అందిన చెక్కుల వివరాలు, వినియోగదారుల వివరాలు, గ్రావెల్ తవ్వకాల అనుమతులను మీడియాకు చూపించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నాలజీలపై పట్టు సాధించాలి


విద్యార్థులు, తల్లిదండ్రులను సన్మానిస్తున్న హనుమంతరావు, లావు రత్తయ్య

చేబ్రోలు: విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలను నేర్చుకుంటూ అప్‌డేట్ అవ్వాలని ఇన్‌స్టా ఈఎమ్ఐ, మయూర హాస్పిటల్స్, అసెట్స్ అండ్ మోర్ సీఈవో హనుమంతరావు యడ్లూరి సూచించారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికల ద్వారా ఉద్యోగాలు సాధించిన 585 మంది విద్యార్థుల తల్లిదండ్రుల్ని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితమనేది బీటెక్ తర్వాత నుంచే ప్రారంభమవుతుందని, ఎక్స్‌పీరియన్స్‌డ్ లెర్నింగ్ అవసరమని సూచించారు. జీవితంలో పైకి ఎదగడానికి దోహదపడిన తల్లిదండ్రులు, మెంటర్స్, గురువులు, స్నేహితుల్ని ఎన్నటికీ మరువకూడదని తెలిపారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించడం వల్ల విద్యార్థుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. విజ్ఞాన్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల్ని సన్మానించడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తమ విద్యార్థులు అన్ని అంశాల్లో ప్రతిభ చూపడంతోనే ఉన్నత ఉద్యోగాలు సాధించగలిగారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.పి. కుమార్ పాల్గొన్నారు.

వేసవిలో శిశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


పెదనందిపాడులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భారతి

గుంటూరు రూరల్: వేసవిలో శిశువుల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ప్రత్తిపాడు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో సుజాత, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డలో శుక్రవారం ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల అభివృద్ధి, ఎదుగుదల, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన పౌష్టికాహారం తదితర విషయాల్ని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం ఉద్యోగులు రమాదేవి, సరిత, స్వర్ణలత, సూపర్‌వైజర్ షేక్ మెహరున్నీసాబేగం, ఐటీసీ ప్రథమ్ సంస్థ ప్రతినిధులు ఎం. జగదీష్, సూరిబాబు, గ్రామస్తులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో...

బరువు, ఎత్తు తక్కువ పిల్లల్ని గుర్తించి వారి వివరాలు యాప్‌లలో నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి చెప్పారు. నాగులపాడు బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఉదయం సెక్టార్ స్థాయి సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ రక్తహీనతకు గురికాకుండా తల్లులకు ఐఎఫ్‌ఏ, క్యాల్షియం మాత్రలు, పిల్లలకు ఐరన్ సిరప్ వారానికి రెండు రోజులు ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. మేలో అంగన్‌వాడీ కేంద్రాల్ని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తెరిచి ఉంచాలని చెప్పారు. సమావేశంలో సెక్టార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


కాకుమానులో ప్రచారం చేస్తున్న నేతలు

కాకుమాను:రాష్ట్రంలో కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కాకుమాను ఎంపీటీసీ–2 సభ్యుడు కానుగుల పరమేశ్వరరావు తెలిపారు. కాకుమానులో శుక్రవారం రాత్రి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన సాగిస్తూ, రాష్ట్ర ప్రజల్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత నాలుగు సంవత్సరాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశం మొత్తం ఆంధ్ర రాష్ట్రం వైపు చూసే విధంగా ప్రజా సంక్షేమ పాలన చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేత నాగరాజు పాల్గొన్నారు.

కాలుష్య నివారణలో హైడ్రోజన్ పాత్ర ప్రధానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు హైడ్రోజన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం హైడ్రోజన్ – కెన్ ఇట్ బి ఏ సేవియర్ ఆఫ్ ది ఎర్త్ ఫ్రం గ్లోబల్ వార్మింగ్ అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ అమరావతి రీజియన్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రెండు రోజులుపాటు జరుగుతుందని తెలిపారు. ప్రొఫెసర్ గణపతి యాదవ్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్య నివారణకు హైడ్రోజన్ ఉపయోగపడే విధానాన్ని వివరించారు. 2070 నాటికి భారతదేశాన్ని కాలుష్యరహిత వాతావరణ సమాజంగా రూపొందించేందుకు హైడ్రోజన్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. దీని ద్వారా ఉష్ణోగ్రతలు సమతుల్యం చేయడమే కాకుండా వాహనాలు, ఫ్యాక్టరీలు, థర్మల్ పవర్‌ప్లాంట్లకు వాడే పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి వాటికి బదులు హైడ్రోజన్ వల్ల ఉత్పత్తి అయ్యే ఇంధనశక్తిని వినియోగించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అమరావతి రీజియన్ సెంటర్ చైర్మన్ డాక్టర్ వి. గోవర్ధన్‌రావు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళి, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బోర్డ్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎ.ఎస్.వి. రామ్‌కుమార్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా, ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెదకాకాని: తల్లిదండ్రులు మద్యం తాగవద్దని మందలించినందుకు గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నంబూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ కరీం కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 23న మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు తాగవద్దని గట్టిగా హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన కరీం ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వెంగళరావునగర్ చెందిన గుండెలగుంట చెంచయ్య ఈనెల 25న డ్యూటీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భార్య జి.రమణ చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందనలు

గుంటూరు ఎడ్యుకేషన్: తమ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సత్తా చాటారని మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్ని అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ విద్యార్థి షేక్ సల్మాన్ 90 శాతం మార్కులతో ఎంపీసీ గ్రూపులో మొదటి స్థానం, ఎంఈసీలో బి.గోవిందా సాయి కామర్స్‌లో 99 శాతం మార్కులు సాధించారన్నారు. సీఈసీలో లూక్ ఒబెర్సన్ 95శాతం మార్కులు కామర్స్‌లో సాధించాడని చెప్పారు. పి.అభిలాష్ , ఏ.నిరంజన్‌రెడ్డి మెరుగైన 70 శాతం మార్కులతో పాటు తెలుగు సబ్జెక్టులో ముగ్గురు విద్యార్థులు 99, 98, 97 మార్కులు సాధించి కళాశాల గౌరవ ప్రతిష్టలు ఇనుమడింప చేశారని ఆయన వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విలువల జోడింపుతో రైతుకు అదనపు ఆదాయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

గుంటూరు రూరల్: రైతులు పండించిన పంటలకు విలువల జోడింపుతో అదనపు ఆదాయాన్ని పొందవచ్చని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో శుక్రవారం విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్‌ఫుడ్ టెక్నాలజీ, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ వాల్యు అడిషన్ ఆఫ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ అనే అంశంపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో పండించే పంటలు, కూరగాయలు, ఆకుకూరలకు విలువలు జోడించే విధానాల్ని వివరించారు. తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం, కట్టె గానుగతో నూనె తీసే విధానం, ఇంటిలోని నిత్యావసర సరుకుల తయారీ విధానాలు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త టి.వి. రమణారావు పాల్గొన్నారు.

వేడుకగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థినులకు ప్రగతి పత్రాలను అందజేస్తున్న ఎంఈఓ కెనడీ, ఉపాధ్యాయులు

చినలింగాయపాలెం(కాకుమాను):మండలంలోని చినలింగాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ కెఎఫ్.కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఆనంద నిలయాలని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో తల్లిదండ్రులు తమ చిన్నారుల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన, గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రైవేటుకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా మౌలిక సదుపాయాల్ని కల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రగతి పత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శివ కోటేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ తిరుపతి వెంకయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనాలు ప్రారంభం


వాహనాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సాంబిరెడ్డి

గుంటూరు రూరల్: ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పెదపలకలూరులో శుక్రవారం నగర మున్సిపల్ కార్పొరేషన్ నుంచి డివిజన్‌కు నూతనంగా అందజేసిన తడిచెత్త, పొడిచెత్త సేకరణ వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇళ్లలోని వ్యర్థాల్ని డస్ట్‌బిన్లలో వేసి వాహనాలలో వేయాలని సూచించారు. తడి, పొడిచెత్తలను వేరుగా పడవేయటం ద్వారా వాటి నుంచి విద్యుత్ తయారు చేసేందుకు వీలుకలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మయ్య, పిట్టల పరమేశ్వరరావు, నాగేశ్వరరావు, రాధాకృష్ణ, జిలాని, అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బండికల్లు జమదగ్ని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తుములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగే సభలో 'కాలం సాక్షి'గా పుస్తకంపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో విస్తృత ఉపాధి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య పూర్ణచంద్రరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచీకరణ నేపథ్యంలో టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఏఎన్‌యూ టూరిజం–ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సుల విభాగాధిపతి ఆచార్య పి.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం చరిత్ర, టూరిజం–ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో టూరిజం, ట్రావెలిజం మూడో స్థానంలో నిలిచి ఆయా దేశాల ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. తరచూ విహార యాత్రలు చేయడం ద్వారా విజ్ఞానం, వినోదంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని చెప్పారు. టూరిజం ద్వారా ప్రజలకు ఆయా ప్రాంతాల చరిత్ర, భాషలు, సంస్కృతులు, నాగరికత, ఆచార వ్యవహారాల గురించి పూర్తిగా తెలుసుకునే అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి చెందిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా రోడ్డు, రైలు, విమాన, సముద్ర ప్రయాణాల ద్వారా లక్షలాది పర్యాటకుల సంఖ్య పెరిగిందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల ద్వారా సాధారణ కోర్సులతో పాటు వృత్తి విద్యా కోర్సులతో ప్రతి సంవత్సరం వందలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చరిత్ర, టూరిజం–ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.అనురాధ, అధ్యాపకులు ఎం.భాస్కరరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు, రేపు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు

కాకుమాను: స్థానిక గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి పంచమ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఏకాహం, తోరణ బంధన, అంకురార్పణ, ధ్వజారోహణ, దీక్షధారణలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం స్వామికి సుప్రభాత సేవ, ఉపనిషత్ పారాయణం, అభిషేకాలు, కల్యాణ మహోత్సవాల్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు సభ్యులు వివరించారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

పెదనందిపాడులో..

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం 92వ వార్షికోత్సవాన్ని ఆదివారం జీజీపాలెంలో నిర్వహించనున్నట్లు అర్చకుడు అద్దంకి పెదబ్రహ్మంరాజు తెలిపారు. మే మూడు వరకు పూజలు, ఆరాధన మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో రోడ్ల మీద భవన నిర్మాణ వ్యర్థాల్ని మూడు రోజుల్లో తొలగించాలని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేసిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. భవన నిర్మాణ సమయంలో తప్పనిసరిగా గ్రీన్‌మ్యాట్‌తో దుమ్ము రాకుండా కవర్ చేసుకోవాలని యజమానులకు సూచించాలని చెప్పారు. ఇప్పటివరకు రీ సర్వే 76 శాతం జరిగిందని, వచ్చే వారానికి 85 శాతం జరగాలని ఆదేశించారు. మే నెలాఖరు నాటికి మీడియా డివైజ్ ఫీజులు నూరు శాతం వసూలు చేయాలని తెలిపారు. బకాయిలు చెల్లించని ప్రకటనల బోర్డుల తొలగింపు వెంటనే చేపట్టాలని చెప్పారు. సమావేశంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు డ్రా

గుంటూరు ఈస్ట్: ఏటీఎం సెంటర్‌లో కార్డు మార్చివేసి మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 3వ లైనుకు చెందిన టి.వీరాస్వామి ఈనెల 24న నగరంపాలెం ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అనారోగ్యంతో డబ్బులు డ్రా చేయలేక అక్కడ ఉన్న వ్యక్తి సహాయం కోరారు. ఆ వ్యక్తి ఏటీఎం కార్డు పెట్టి పని చేయడం లేదని చెప్పి మార్చి ఇంకొకటి ఇచ్చాడు. అనంతరం కొంతసేపటికి వీరాస్వామి అకౌంట్‌లో నుంచి రూ. 35వేలు విత్‌డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. తాను మోసపోయినట్లు గుర్తించి వీరాస్వామి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి శనివారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతాదేవి తెలిపారు. యనమదల శివాలయం సెంటరు, లేమల్లెపాడు, జీజీపాలెం, ఏబీపాలెం, ముట్లూరు బీసీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శనివారం గుంటూరు మహిళా ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువుల విక్రయం

కాకుమాను: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు, పురుగు మందుల్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు తిరుమలాదేవి ఆదేశించారు.స్థానిక రైతు భరోసా కేంద్రం–2లో శుక్రవారం మండలంలోని ఎరువుల దుకాణ యజమానులతో రానున్న ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా విక్రయంలో జాగ్రత్తలు పాటించాలని, సాగు చేస్తున్న విస్తీర్ణం బట్టీ విక్రయించాలని చెప్పారు. అధిక మొత్తంలో విక్రయించే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎరువులు,పురుగు మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకీ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో ఏఓలు శివపార్వతి, కె.కిరణ్మయి, దుకాణ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో దాడిపై కేసు నమోదు


పెదకాకాని: పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని కత్తితో ఇద్దరిని గాయపరచిన సంఘటన నంబూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని మండల పరిధిలోని నంబూరు గ్రామానికి చెందిన కె. గోపాలరామకృష్ణ విజయవాడలోని ఓ చీరల షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రతిరోజూ ఇంటి నుంచి గోపాల రామకృష్ణ విజయవాడ బైక్‌పై వెళుతుంటాడు. ఈనెల 25న బావ తోకల కోటేశ్వరరావుతో కలసి బైక్‌పై వెళుతుండగా మేడా చంద్రశేఖర్, మేడా సురేష్, మేడా మాధవరావు బైక్‌లతో అడ్డగించారు. అసభ్యంగా మాట్లాడుతూ కత్తితో గాయపరచారు. బాధితుల్ని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈనెల 24న నంబూరులో మేడా సురేష్, మేడా కోటేశ్వరికి మధ్య జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని కత్తితో గాయపరిచారని గోపాల రామకృష్ణ పోలీసులకు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయంలో బీఓబీ సన్ రూఫ్ నిర్మాణం



కొరిటిపాడు(గుంటూరు): నల్లపాడులోని కేంద్రీయ విద్యాలయంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.2 లక్షల విలువైన సన్ రూఫ్‌ను నిర్మించినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) రీజినల్ మేనేజర్ పి.అమరనాథరెడ్డి తెలిపారు. నూతనంగా నిర్మించిన సన్ రూఫ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో బీఓబీ ముందువరుసలో ఉంటుందని వెల్లడించారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ హనీ మెహతా మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పిల్లలు ఇబ్బందులు పడకుండా బీఓబీ యాజమాన్యం సన్ రూఫ్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బీఓబీ రీజినల్ మేనేజర్ అమరనాథరెడ్డి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బీఓబీ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ డెప్యూటీ రీజినల్ మేనేజర్ ఎం.విద్యాసాగర్, చీఫ్ మేనేజర్లు ఎం.పి.సుధాకరరావు, వై.సుబ్రహ్మణ్యం, రాజభాష అధికారి డి.రమేష్‌బాబు, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, కేంద్రీయ విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఆనంద్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి



పాత గుంటూరు: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు అరండల్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నిర్మాత సి.అశ్వనీదత్‌ను టీడీపీ సీనియర్ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, తెనాలి శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, డేగల ప్రభాకరరావు, కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు.